క్లుప్తంగా

అంగన్‌వాడీ సహాయకుల పోస్టుకు దరఖాస్తులు

తిరుపతి తుడా/తిరుపతి కల్చరల్: రాస్‌–ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ అంగన్‌వాడీ సహాయకురాలు కోసం తిరుపతి ప్రాంత పరిధిలోని అంగన్‌వాడీ సహాయకురాల ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వనిస్తున్నట్లు రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి అర్బన్ పరిధిలోని నెహ్రూ నగర్–1, నెహ్రూనగర్–3, మంగళం క్వార్టర్స్–1, మంగళం క్వార్టర్స్–3, యాదవ కాలనీలో అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులు ఖాళీల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు 21 నుంచి 35 ఏళ్లలోపు వయసు కలిగిన స్థానికంగా ఆధార్ కార్డు కలిగిన వివాహిత మహిళలు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 7వ తేదీలోపు అభ్యర్థుల వివరాలతో కూడిన దరఖాస్తులను రాస్ ప్రధాన కార్యాలయం, ఎయిర్ బైపాస్ రోడ్డు, తిరుపతి చిరునామాకు అందజేయాలని కోరారు.

చట్టాలపై అవగాహన



తిరుమల: మహిళా వారోత్సవాల్లో తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళలు, బాలికలకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చట్టపరంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తే ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశాల గురించి వివరించారు. ప్రత్యేకంగా మహిళల కోసం ఉన్న చట్టాల గురించి తెలుసుకోవాలని సూచించారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌కు అత్యాధునిక వైద్యం



మీడియాతో మాట్లాడుతున్న అపోలో వైద్యులు

తిరుపతి తుడా: అపోలో హాస్పిటల్‌లో బ్రెయిన్ స్ట్రోక్‌కు అత్యాధునిక పద్ధతిలో వైద్య సేవలు అందిస్తున్నట్లు ప్రముఖ న్యూరో సర్జన్ చెన్నై అపోలో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ శ్రీనివాసన్ పరమశివం తెలిపారు. శనివారం స్థానిక లక్ష్మీపురం సర్కిల్ సమీపంలోని అపోలో ఆస్పత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో ప్రమాదకరమైన బ్రెయిన్ స్ట్రోక్‌కు చెన్నై గ్రీమ్స్ రోడ్డులోని అపోలో ఆస్పత్రిలో నూతన టెక్నాలజీతో శస్త్ర చికిత్స నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుండెపోటైనప్పుడు గుండెకు ఎలా యాంజియో చేస్తామో, అదేవిధంగా బ్రెయిన్ డెడ్ అయి మెదడులో రక్తం క్లాట్ అయినప్పుడు బ్రెయిన్‌కు యాంజియో చేసి తొలగించవచ్చన్నారు. ప్రమాదం జరిగిన 2 నుంచి 24 గంటల లోపు రోగి అపోలో ఆస్పత్రికి రాగలిగితే అధునాతన శస్త్రచికిత్స ద్వారా 80 శాతం బ్రెయిన్ స్ట్రోక్‌ను అరికట్టవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో న్యూరో ఫిజీషియన్ డాక్టర్ కార్తికేయన్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


ఆక్యుపంక్చర్ పితామహుడు డాక్టర్ బీకే బసు



మాట్లాడుతున్న ఆక్యుపంక్చర్ వైద్యుడు డాక్టర్ బాలాజీ

తిరుపతి కల్చరల్: భారతదేశంలో ఆధునిక ఆక్యుపంక్చర్ వైద్యానికి ఆద్యుడు డాక్టర్ బీకే బసు అని, ఆయన త్యాగనిరతి, ఆదర్శం కారణంగా తమలాంటి వారు ఈ వైద్యంలో కొనసాగుతున్నామని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో యశోదనగర్‌లోని కార్యాలయంలో శనివారం సాయంత్రం డాక్టర్ బీకే బసు 113వ జయంతి సభ నిర్వహించారు. ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ రవీంద్ర అధ్యక్షత జరిగిన ఈ సభకు ఆక్యుపంక్చర్ వైద్యుడు డాక్టర్ ఎంఎస్ బాలాజీ, సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ, బాలోత్సవం అధ్యక్షుడు టింకాయల దామోదరం, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున వక్తలుగా పాల్గొని ప్రసంగించారు. వేమన విజ్ఞాన కేంద్రంలో ఆయన పేరిట ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామని, ప్రస్తుతం వారానికి ఒకరోజు ఉచిత వైద్యశిబిరం కొనసాగుతోందని వివరించారు. కార్యక్రమంలో తిరుపతి నగరానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రూ.30 వేలు విరాళం



చెక్కు అందజేస్తున్న మొహిద్దీన్‌బాషా దంపతులు

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఎండోమెంట్ ప్రైజ్‌కు రూ.30,000 విరాళం అందించినట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.వి. రమేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ గురువారం పదవీ విరమణ పొందిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా భార్య ఫరీదాబేగం దంపతుల పేర్లు మీదుగా ఈ ఎండోమెంట్ ప్రైజ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు కళాశాలకు రూ.30,000 చెక్కును అందజేశారు.

పాడిపరిశ్రమ.. ఆర్థికాభివృద్ధికి చిరునామా

శ్రీవేంకటేశ్వర వెటర్నరీ వర్సిటీ నిరంతర పశు వైద్య విద్య, సమాచార కేంద్రం పాడి పరిశ్రమాభివృద్ధికి కృషి చేస్తోంది. ఇందులో భాగంగా గ్రామీణ ఎస్సీ మహిళలకు గొర్రెలు, మేకల పెంపకంపై మూడు రోజుల పాటు పూర్తి స్థాయి శిక్షణ అందించింది. శాస్త్రీయ పద్ధతుల్లో గొర్రెల పెంపకం, పోషణ, యాజమాన్య పద్ధతుల్లో మెళకువలు, వ్యాధుల నిర్ధారణ, చికిత్సా విధానం, వ్యాక్సినేషన్, మాంసాహార పదార్థాల తయారీ, మార్కెట్ క్రయవిక్రయాలపై విస్తృత స్థాయిలో గ్రామీణ మహిళలకు శిక్షణ అందించారు.

- ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా మహిళలకు ఉచిత గొర్రెల పంపిణీ
- వెటర్నరీ వర్సిటీలో గ్రామీణ మహిళలకు శిక్షణ
- నిరంతర విద్యా సమాచార కేంద్రం కృషి అభినందనీయమంటున్న మహిళలు



శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు, హాజరైన పలు ప్రాంతాలకు చెందిన గ్రామీణ మహిళలు



గొర్రెలు పంపిణీ చేస్తున్న వర్సిటీ వీసీ, అధికారులు

తిరుపతి సిటీ: మహిళా సాధికారితే ధ్యేయంగా గ్రామీణ మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా పాడిపరిశ్రమ వైపు ప్రోత్సహించేందుకు వెటర్నరీ వర్సిటీ కృషి చేస్తోంది. కోళ్లు, సీమపందుల పెంపకంతో పాటు గొర్రెలు, మేకల పెంపకంపై శిక్షణ ఇచ్చి ఉచితంగా 3 నుంచి 4 నెలల వయస్సు గల గొర్రెలను అందిస్తోంది. శనివారం శిక్షణ పూర్తి చేసుకున్న సుమారు 25 మంది మహిళలకు వర్సిటీ వీసీ జేవీ రమణ చేతుల మీదుగా ఒక్కొక్కరికి రెండు గొర్రెల చొప్పున ఉచితంగా అందజేశారు. అలాగే సుమారు 10కేజీల దాణా బ్యాగులను సైతం మహిళలకు అందజేశారు.

పాడిపరిశ్రమ అభివృద్ధే లక్ష్యం..

ఎస్వీ వెటర్నరీ వర్సిటీ పాడిపరిశ్రమ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని నిరంతర పశువైద్యవిద్య, సమాచార కేంద్రం పాడిరైతులకు వరం లాంటిదని వీసీ జేవీ రమణ కొనియాడారు. పలు రాష్ట్రాలకు చెందిన ఎంతోమంది ఔత్సాహికులు పాడిపరిశ్రమలను స్థాపించి పారిశ్రామికవేత్తలుగా రాణిస్తున్నారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు అందించిన శిక్షణతో మరింత వృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. పరిశోధన సంచాలకులు శ్రీలత, విస్తరణ సంచాలకులు డాక్టర్ శోభామణి, డాక్టర్ బాలకృష్ణన్, కోఆర్డినేటర్ డాక్టర్ సుజాత చేతులు మీదుగా గొర్రెపిల్లలను పంపిణీ చేశారు.

ఉత్తమ శిక్షణ అందించారు



మాది శ్రీకాళహస్తి పల్లాం. గొర్రెల పెంపకంపై ఆసక్తి ఉండడంతో ఎస్సీ సబ్‌ప్లాన్ ద్వారా అధికారులు మమ్మల్ని ఎంపిక చేశారు. వ్యవసాయ కుటుంబం గనుక కొంతవరకు అవగాహన ఉన్నా, శిక్షణతో మరిన్ని విషయాలను తెలుసుకున్నాం. రెండు పొట్టేలు పిల్లలను అందించారు. దాణా ఉచితంగా ఇచ్చారు.

– స్వప్న, గృహిణి, పల్లాం, శ్రీకాళహస్తి

ఇంత అవగాహన లేదు



పాడి పరిశ్రమలో రైతుకు ఆదాయం సమకూర్చే రంగం గొర్రెల పెంపకం. మహిళలు సైతం సులువుగా వ్యాపారం చేసుకునేందుకు వీలుంటుంది. వర్సిటీ అధికారులు మూడు రోజుల పాటు శిక్షణ అందించి ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులతో ఉచితంగా గొర్రెలను పంపిణీ చేశారు. మరింత అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తా.

– నందిని, మహిళా రైతు, చింతలపాళెం

ఉచిత గొర్రెల పంపిణీతో ..



శాస్త్రీయ పద్ధతులలో గొర్రెల, మేకల పెంపకంపై శిక్షణ ఇచ్చి ఉచితంగా గొర్రెలను పంపిణీ చేశారు. వీటిని అధికారులు సలహాలు, సూచనలు పాటించి మరింత వృద్ధి చేసుకుంటాం. శిక్షణలో ప్రధానంగా పోషణతో పాటు విలువ ఆధారిత మార్కెట్‌పై అవగాహన కల్పించడం సంతృప్తినిచ్చింది.

– సుగుణ, మహిళా రైతు, పల్లాం

ఆర్థిక భరోసా కల్పించినట్లు ఉంది



ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ప్రోత్సాహం మరువలేనిది. గృహిణిగా ఉంటూ ఆర్థికంగా బలపడేందుకు గొర్రెల పెంపకం ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఎంతోమంది గొర్రెలు, మేకలు పెంచుతున్నారు. కానీ పూర్తిస్థాయిలో వాటి పోషణపైన, యాజమాన్య పద్ధతులపైన అవగాహన లేదు.

– కమలజ, గృహిణి, చింతలపాలెం

మహిళలను ప్రోత్సహించడమే లక్ష్యం



ఎస్వీ వెటర్నరీ వర్సిటీ నిరంతర పశువైద్య విద్య, సమాచారం కేంద్రంలో ఎంతో మంది గ్రామీణ పురుష, మహిళా రైతులకు పాడిపరిశ్రమ శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. పాడిరైతుకు వర్సిటీ అండగా ఉంటూ సలహాలు, సందేహాల నివృత్తిని ఇస్తూ ప్రోత్సహిస్తోంది.

– డాక్టర్ సుజాత, ఆర్గనైజర్, ఎస్వీ వెటర్నరీ వర్సిటీ

శాస్త్రోక్తంగా బాలాలయం



కుంభాలను ఊరేగింపుగా యాగశాలకు తీసుకొస్తున్న ఆలయ అర్చక పండితులు

తిరుపతి కల్చరల్: అలిపిరి పాదాల మండపంలోని శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయం, శ్రీలక్ష్మీ నారాయణ స్వామివారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీగోదా అమ్మవారి ఆలయంలో అష్టబంధనం కారణంగా శనివారం బాలాలయం సంప్రోక్షణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 3వ తేదీ సోమవారం చేపట్టే పూర్ణాహుతితో ఈ కార్యక్రమాలు ముగియనున్నాయి. ఆదివారం ఉదయం 8 గంటలకు యాగశాలలో పంచగవ్యాధివాసం, క్షీరాధివాసం, జలదివాసం, నిర్వహించనున్నారు. కార్యక్రమంలో శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల దీక్షితులు, వైఖానస ఆగమ సలహాదారు మోహనరంగాచార్యుడు, సలహాదారు లు, రుత్వికులు, అధికారులు పాల్గొన్నారు.

చెత్తపై అవగాహన

పాకాల: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఈఓపీఆర్డీ శశిరేఖ తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. శనివారం ఆమె పలు గ్రామాల్లో జరుగుతున్న చెత్త సేకరణను పరిశీలించారు.

శ్రీవారి సేవలో మజాకా చిత్ర బృందం



తిరుమల ఆలయం వెలుపల హీరో సందీప్ చిత్ర బృందం



సినీనటి మెహ్రీన్

తిరుమల: మజాకా సినిమా బృందం శనివారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. వారిలో హీరో సందీప్ కిషన్‌తోపాటు నిర్మాత, దర్శకుడు తదితరులు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. దర్శనానంతరం ఆలయం వెలుపల పలువురు యువకులు సందీప్‌కిషన్‌తో సెల్ఫీలు తీసుకున్నారు. అదేవిధంగా సినీతార మెహ్రీన్ కౌర్ ఫిర్జాదా శ్రీవారిని దర్శించుకున్నారు.

ప్లాస్టిక్ రహిత తిరుపతే మన లక్ష్యం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న కమిషనర్, అధికారులు

తిరుపతి తుడా: పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య పిలుపునిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్లాస్టిక్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ స్థానిక అన్నమయ్య కూడలి నుంచి దండి మార్చ్ (ఎమ్మార్ పల్లి) కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ నియంత్రణకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అన్నివిధాలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. 120 మైక్రాన్స్ కంటే ఎక్కువ ఉన్న ప్లాస్టిక్ వస్తువులు వినియోగించరాదని, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వస్త్ర బ్యాగులు, పేపర్ కవర్లు వినియోగించేలా ప్రజలకు దుకాణదారులు అవగాహన కల్పించాలన్నారు. నగరంలో ప్లాస్టిక్ నిషేధంపై తనిఖీలు చేస్తామని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ర్యాలీలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, మున్సిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు, డీఈలు, శానిటరీ సూపర్‌వైజర్లు, మెప్మా కృష్ణవేణి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు

దళిత ఉద్యోగిపై ఎందుకింత వివక్ష ?



మాట్లాడుతున్న పుణ్యమూర్తి

తిరుపతి కల్చరల్: తిరుపతి నగర పాలక సంస్థలో దళితుల పట్ల వివక్ష చూపుతూ వారి అభ్యున్నతిని అడ్డుకుంటున్నారని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది చింతమాకుల పుణ్యమూర్తి ధ్వజమెత్తారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుపతి నగర పాలక సంస్థలోని జనన, మరణ రిజిస్ట్రేషన్ శాఖలో ఆయాగా పని చేస్తున్న కల్లూరు లక్ష్మీదేవికి మూడేళ్లుగా హెల్త్ అసిస్టెంట్ పదోన్నతి ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గత నెల 20న మున్సిపల్ కౌన్సిల్‌లో తీర్మానం పెట్టి అనుమతి తీసుకుంటామని ప్రస్తుత కమిషనర్ మౌర్య చెప్పి పెట్టకపోవడంతో గత నెల 28న ఆమెను కలిసి పదోన్నతి కల్పించి న్యాయం చేయాలని కోరామన్నారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ తనకన్నా కౌన్సిల్ సుపీరియర్, మున్సిపల్ ఎక్స్ అఫీషియో సభ్యుడు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దళిత ఉద్యోగి పదోన్నతిని పెండింగ్‌లో పెట్టమన్నారని చెప్పడం దారుణమన్నారు. ఆమెకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. బాధితురాలి భర్త కె.వెంకటేష్, దళిత సంఘ నేతలు పాల్గొన్నారు.

ఊబకాయంతో ఆరోగ్యానికి ముప్పు



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు

తిరుపతి తుడా: ఊబకాయంతో ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఎండోక్రినాలజీ విభాగాధిపతి డాక్టర్ అలోక్ సచిన్ హెచ్చరించారు. స్విమ్స్ ఎండోక్రినాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ విభాగాల ఆధ్వర్యంలో పద్మావతి ఆడిటోరియంలో నిరంతర వైద్య విద్య కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఊబకాయంతో గుండె సంబంధిత సమస్యలు, డయాలసిస్‌తో పాటు కొన్ని రకాల క్యాన్సర్ బారిన పడే ప్రమాదం ఉందన్నారు. బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ సుచిత్ర, రిజిస్ట్రార్ అపర్ణ ఆర్ బిట్లా, వైద్యులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షల పుస్తకాలేవీ..!



గ్రంథాలయాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు

తిరుపతి అర్బన్: 'న్యూస్ పేపర్లు సరే.. పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు ఏవీ ? గ్రంథాలయాల్లో వాటిని అందుబాటులో ఉంచండి' అంటూ పాఠకులు కోరారు. శనివారం రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు తిరుపతి నగరంలోని అన్నమయ్య సర్కిల్ గ్రేడ్–1 గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురు యువత చదువుకునేందుకు ప్రత్యేక స్టడీ హాల్‌ను ఏర్పాటు చేయాలని, ఉచితంగా ఇంటర్నెట్ వైఫై సౌకర్యం కల్పించాలని కోరారు. పరిశీలిస్తామని చైర్మన్ వారికి సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శివప్రసాద్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

చంద్రగిరి/పాకాల : నియోజకవర్గవ్యాప్తంగా ఇంటర్మీడియెట్ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. చంద్రగిరి, పాకాలలోని ప్రభుత్వ బాలురు, బాలికల కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తెలుగు, సంస్కృతం, హిందీ పరీక్షలు నిర్వహించారు. మొదటి రోజు పరీక్షలకు చంద్రగిరిలో 2169 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 46మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు కస్టోడియన్ అమరేశ్వర్ రెడ్డి వివరించారు.

ఆ భవన నిర్మాణాలను ఉపేక్షించొద్దు



19వవార్డులో పర్యటిస్తున్న కమిషనర్, కార్పొరేటర్ ఆరణి సంధ్య

తిరుపతి తుడా: నగరంలో అనుమతులు లేని భవన నిర్మాణాలను ఉపేక్షించొద్దని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని 19వ వార్డులో కార్పొరేట్ ఆరణి సంధ్య, ఇంజినీరింగ్, హెల్త్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలసి న్యూబాలాజీ కాలనీ, టీటీడీ ఫ్లాట్స్, ఎస్‌కేడీ నగర్, వైకుంఠపురం పార్కు, రాస్ బిల్డింగ్, తహసీల్దార్ కార్యాలయం రోడ్డు తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను, భవన నిర్మాణాల అనుమతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో అనుమతులు లేకుండా భవన నిర్మాణాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయని, టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ కార్యదర్శులు నిత్యం ఆయా వార్డుల్లో పర్యవేక్షించాలని సూచించారు. సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఇంజినీర్ తులసి కుమార్, డీఈలు మహేష్, లలిత, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

సీఎం సారూ.. వర్సిటీపై దృష్టి పెట్టరూ..!



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: చిత్తూరు పర్యటన నిమిత్తం రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సీఎం చంద్రబాబును శనివారం ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం వర్సిటీలోని పలు సమస్యలపై సీఎంకు విన్నవించినట్లు తెలుస్తోంది. తాత్కాలిక అధ్యాపకుల నియామకం, శాశ్వత ఉద్యోగుల వేతనాలు, వర్సిటీకి రావలసిన గ్రాంట్స్‌పై విన్నవించినట్లు సమాచారం.

ఘనంగా భగవాన్ రామకృష్ణ జయంతి



రామకృష్ణుల జయంతి వేడుకలను ప్రారంభిస్తున్న సుకృతానంద

తిరుపతి కల్చరల్: భగవాన్ శ్రీరామకృష్ణ జయంతిని ఇస్కాన్ రోడ్డులోని రామకృష్ణ మిషన్ ఆశ్రమంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం రామకృష్ణ పరమహంస చిత్రపటానికి మంగళహారతి, సుప్రభాతం, ప్రత్యేక పూజలు నిర్వహణతో పాటు వేద పారాయణ ధ్యానం చేపట్టారు. ఈ సందర్భంగా ఆశ్రమం కార్యదర్శి సుకృతానంద మాట్లాడుతూ శ్రీరామకృష్ణుల జీవిత సందేశాన్ని అందజేశారు. ఈ సందర్భంగా 50 మందికి టీ షర్టులు, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్లు, భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల : స్థానిక రామకృష్ణ మందిరంలో రామకృష్ణ పరమహంస జయంతిని సమితి అధ్యక్షుడు ఎన్‌సీ.రామచంద్రారెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. అష్టావధాని ఆముదాల మురళీ ముఖ్య అతిథిగా హాజరై శ్రీరామకృష్ణ జీవిత చరిత్రపై ఉపన్యాసం చేశారు. సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నేడు స్థానికులకు శ్రీవారి దర్శన టోకెన్ల జారీ

తిరుమల: ప్రతి నెలా మొదటి మంగళవారం (మార్చి 4) స్థానికులకు కల్పించే దర్శనంలో భాగంగా ఆదివారం దర్శన కోటా టోకెన్లను టీటీడీ జారీ చేయనుంది. తిరుపతి స్థానికులకు మహతి ఆడిటోరియంలోని కౌంటర్లలోను, తిరుమలలోని స్థానికులకు బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో మొదట వచ్చిన వారికి మొదటి ప్రాతిపదికన ఉదయం 5 గంటల నుంచి శ్రీవారి దర్శన టోకెన్లు జారీ చేయనున్నారు. ఈ విషయాన్ని గమనించి తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలకు చెందిన స్థానిక భక్తులు ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

రేపటి నుంచి ఉచిత వినికిడి నిర్ధారణ పరీక్షలు

తిరుపతి కల్చరల్: వరల్డ్ హియరింగ్ డేని పురస్కరించుకుని సోమ, మంగళవారాల్లో ఉచిత వినికిడి నిర్ధారణ పరీక్షలతోపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కొంకావీధిలోని తిరుపతి స్పీచ్ అండ్ హియరింగ్ కేర్ సెంటర్ నిర్వాహకుడు డాక్టర్ పి.గోపీనాథ్ తెలిపారు. మొబైల్‌లో ఎక్కువగా మాట్లాడడం, శబ్ద కాలుష్యం, పరిశ్రమల ప్రభావం వల్ల వినికిడి సమస్యలు వస్తున్నాయని తెలిపారు. సోమ, మంగళవారాలు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత పరీక్షల శిబిరం, అవగాహన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వివరాలకు 7337041017లో సంప్రదించాలని కోరారు.

సమాజానికి ఉపయోగపడేలా సైన్స్ పరిశోధనలు

తిరుపతి సిటీ: సమాజానికి ఉపయోగపడేలా సైన్స్ పరిశోధనలు ఉండాలని ఎస్వీయూ సైన్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పద్మావతి తెలిపారు. ఎస్వీయూ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇటీవల సైన్స్ రంగంలో జరిగిన పరిశోధనలు ప్రపంచంలోనే మన దేశ గౌరవాన్ని ఇనుమడింప చేసేలా ఉన్నాయని తెలిపారు. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా కొత్త ఆవిష్కరణలు జరగాలని ఆకాంక్షించారు. ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు మాట్లాడుతూ సైన్స్‌లో ఫిజిక్స్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు.

చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డికి అభినందనలు



చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, హర్షిత్ రెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న యువకులు

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సిఫార్సుల మేరకు జిల్లా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియమితులైన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి గజమాల వేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేత ఓబుల్‌రెడ్డి, కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెంగల్ రెడ్డి, మదనమోహన్ రెడ్డి, భానువర్ధన్ నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, వినోద్ నాయుడు, గుణశేఖర్ నాయుడు, సయ్యద్ బాషా, వీరనాగేంద్ర, తేజష్ రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

సొంత వాహనాలను ట్యాక్సీలుగా వాడితే చర్యలు



మాట్లాడుతున్న డీటీసీ మురళీమోహన్

తిరుపతి మంగళం : సొంత వాహనాలు (వైట్‌బోర్డు)ను ట్యాక్సీలుగా వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా రవాణా శాఖాధికారి(డీటీఓ) కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు. మంగళంలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో శనివారం ట్యాక్సీ క్యాబ్ వాహన డ్రైవర్లు, యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. గత 14 రోజులుగా ఉబర్ సంస్థ కింద ఉన్న ట్యాక్సీ క్యాబ్ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల్ని రవాణా శాఖ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆయన మాట్లాడుతూ వైట్‌బోర్డుతో ఉన్న వాహనాలను సొంతానికి వినియోగించుకోవాలే తప్ప ట్యాక్సీగా వినియోగించరాదన్నారు. ఎంవీఐలు,ఉబర్ వాహన యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీఎం ప్రసంగం వీక్షణ

తిరుపతి అర్బన్: దేశ ప్రధాని నరేంద్రమోదీ వ్యవసాయం, గ్రామీణ శ్రేయస్సుకు చెందిన బడ్జెట్ అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా రైతులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ క్రమంలో తిరుపతి జిల్లా నుంచి నగరంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం ద్వారా పలువురు అధికారులతోపాటు రైతులు ఆయన ప్రసంగాన్ని వీక్షించారు. ఎల్డీఎం విశ్వనాథ్ రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ ఆర్ఎం రాంప్రసాద్, అగ్రికల్చర్, హార్టికల్చర్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.